## కథ

"మానభంగం కేసులో ఎమ్మెల్యే?

రాష్ట్రంలోని అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే శ్రీ సత్యనారాయణరావు తనను మానభంగం చేయడానికి ప్రయత్నించాడని, వారికి రోజూ పాలు సరఫరా చేసే యువతి నేడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఉదయం అయిదున్నరకు ఎప్పటిలాగే పాలు పోయడానికి వెళ్ళిన యువతి లక్ష్మి శీలాన్ని దోచుకోవడానికి శ్రీ సత్యనారాయణరావు ప్రయత్నించారని ఆయనపై ఆరోపణ వచ్చింది. స్థానిక ఎస్.ఐ కేసు నమోదు చేసుకున్నారు."

కాఫీలు, టీలు తాగడం కూడా మరచిపోయి ఆ వార్తను ఎంతో ఆసక్తిగా చదివారు ప్రజలు. తగిన అవకాశం కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ప్రతిపక్ష సభ్యులు ఆ వార్త వద్ద పత్రికను కళ్ళకద్దుకుని మరీచదివారు సంతోషంగా.

"ఇప్పుడు చూడాలి. ప్రభుత్వం ఎలా నిలబడుతుందో?" అన్నాడు మాచిరాజు తనతోటి ప్రతిపక్ష సభ్యుడితో.

"ఏముంది? వెంటనే రాజీనామా చేయాల్సిందిగా హైకమాండ్ ఆదేశిస్తుంది. అతను చేసేస్తాడు. ఎంక్వయిరీలు అదీ ఇదీ జరిగి నిజం తెలిసే లోపుగా ప్రజలు ఆ సంగతే మరచిపోతారు. అతను మళ్ళీ ఏదో మంత్రో, ఛైర్మనో అవుతాడు. ఈమాత్రం దానికి ప్రభుత్వానికి ఏమవుతుంది, పోదురూ!" విసుక్కున్నాడు తోటి ప్రతిపక్ష సభ్యుడు.

"నీలాటి మట్టి బుర్రలుండబట్టే మనం అధికార పార్టీ పోగొట్టుకుని ప్రతిపక్షంలో తగలడ్డాం. లేకపోతే ఏవిటోయ్ నీ అమాయకత్వం? ఓ వేపు మానభంగం అడ్డం పెట్టుకుని బంద్‌కి పిలుపునిస్తూనే, మరో వేపు కేసులో ఇరుక్కున్న ఎమ్మెల్యేను దువ్వాలి. మచ్చిక చేసుకోవాలి. 'నీకేం ఫరవాలేదు. నీకేమైనా అయితే మేమున్నాం' అంటూ రెచ్చగొట్టాలి. 'నీ పార్టీ సస్పెండ్ చేస్తే మాలో చేరిపో. మా ప్రభుత్వం ఏర్పడితే రెండో స్థానం నీదే' అంటూ ఆశ చూపాలి. అతని తలబిరుసుతనానికి వాడి పార్టీ గెంటేస్తుంది. దాంతో రెచ్చిపోయి ఇంతకాలంగా పార్టీలోజరుగుతున్న అవకతవకల్నీ కుంభకోణాల్నీ పూసగుచ్చినట్లు, ఫైల్ నంబర్స్‌తో, తేదీలతో సహా ప్రజలకు చెపుతాడు. దాంతో ప్రభుత్వం ప్రతిష్ఠ దెబ్బతింటుంది. త్వరలో రాబోయే ఎన్నికల్లో అతన్ని ముందుంచుకుని, మనం ప్రచారం మొదలుపెడతాం!" అంటున్న మాచిరాజు ఆలోచనలకి చేతులెత్తినమస్కరించాడు రెండో ప్రతిపక్ష సభ్యుడు.

** ** **

ప్రతి రోజూ బారెడు పొద్దెక్కితేగాని లేవని వీరేశం ఆ రోజు తెల్లరాజామున నాలుగు గంటలకే నిద్రలేచి ముస్తాబయ్యాడు. తను నమ్మిన రాజకీయ పార్టీలో చురుకుగా పనిచేసే వీరేశానికి ఆ రోజు చేతినిండా పనుంది. రెండ్రోజుల క్రితం తమ నాయకుడు మాచిరాజు తమకు నూరిపోసిన మాటలు అతని చెవిలో ఇంకా గింగురుమంటున్నాయి.

"చూడు వీరేశం! మన పార్టీ భవిష్యత్తుకు సంబంధించిన విషయమిది. అధికార పార్టీని గద్దె దింపడానికి ఇంతకన్నా మంచి అవకాశం మనకు రాకపోవచ్చు. మనం అధికారంలో ఉన్నప్పుడు మనం చేసిన ప్రతి చిన్న పొరపాటునీ ప్రజలకు భూతద్దంలో చూయించారు అవతలి వాళ్ళు. ఇప్పుడు మనం మాత్రం వాళ్ళనెందుకు వదలాలి చెప్పు! ఎల్లుండి



